

చెహోవ్ కథ

# కనువిప్పు

"వెదికితే పేడకుప్పలో కూడా ఆణిముత్యం దొరుకుతుంది" క్రైలోవ్.

నిలకడలేని ఆలోచనల్తో అల్లకల్లోలంగా వుంది మనసు. చిన్ననాటి ప్రేయసి ఆ వుదయం కనిపించిది. పాతికేళ్లనాటి మాట. ఆ రోజుల్లో ఆమె అద్భుత సౌందర్యవతి. యువకులందరూ వెర్రెక్కి వెంటపడేవాళ్లు (తనతో సహా). మెరుపు తీగ. లేత గులాబీ. స్వప్న సుందరి. ఎంతమంది ఎన్ని రకాల వూహించుకున్నారో ఆమెను. నడిస్తే కందిపోయే పాదాలు. తగిలితే కమిలిపోతుందనిపించే శరీర మార్ధవం. ఆ నవ్వుకే ప్రాణాలివ్వాలనిపించే సమ్మోహనత్వం. కైపెక్కించే మత్తుకళ్లు.

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

ఈరోజు వుదయం ఆమె లావెక్కి మొద్దుబారిన వొళ్లు. గారపట్టిన పళ్లు. గొదులో, మాటలో కర్కశత్వం. ఆనాటి సుందరి కాలక్రమంలో తనిలా కాబోతున్నానని తెలిస్తే ఆత్మహత్య చేసుకునేది కాదూ!




కుర్చీలో వెనక్కువాలి కూర్చున్నాడు. చేతిలో పెన్సిల్ కాగితం మీద కదుల్తూనే వున్నది. ఎవరో వీపులో చరిచినట్టుగా వులిక్కిపడి కాగితం మీది గీతలు చూశాడు.

తెలియకుండానే ఒక అందమైన స్త్రీ చిత్రం తయారైంది. ఎవరో ఒక స్త్రీ కాదు. తనకు తెలిసిన అలనాటి సుందరి. తను చిత్రకారుడు కాదే. డ్రాయింగ్ అంటే ఏమిటో కూడా తనకు తెలియదు. లైన్లు, బొమ్మలు గీయటం అసలెప్పుడూ ఆ విషయమైనా వూహించలేదు.

తనను తను నమ్మలేకపోతున్నాడు. తనలో యింత ప్రతిభ నిక్షిప్తమై వుందా? యాభై రెండేళ్లుగా తనెందుకు రహస్యం గ్రహించలేకపోయాడు! జీవిత చరమాంకంలో యిప్పుడు తెలుసుకొని ఏం ఉపయోగం!

ఇప్పుడైనా సరే. బొమ్మలు వేస్తూ పోతే సరి! అనతికాలంలో గొప్ప చిత్రకారుడిగా పేరొస్తుంది.

లాటరీ టికెట్టు తగిలినా,

యిప్పుడున్న సీనియర్

ఉద్యోగం నించి మరో వున్నతోద్యోగానికి ప్రమోషన్ వచ్చినా యింత ఆనందం దొరకదు. జీవితం ధన్యమైంది. తనలో దాగిన సృజన, వుబికి వచ్చి, కాగితం మీద పున:సృష్టి చేసుకుంది... ప్రముఖ చిత్రకారుడు

బంట్రోత్తు వచ్చి, డిన్నర్ రెడీగా వుందని చెప్పాడు. సుష్టుగా భోంచేసి, రెండో గ్లాసు వైను ఖాళీ చేసి కళాకారుడిగా తను గడపబోయ్యే జీవితాన్ని గురించి కలలుగన్నాడు.

ఇంత కళ తనలో దాగివున్నట్టుగా తనకు నిజంగా తెలియదా! బొమ్మలంటే తనకిష్టమేనే! చిన్నప్పుడు ఒకటిరెండుసార్లు నాటకాల్లో వేషాలు కూడా వేశాడు. నాటకాలు, చిత్రకళ, వుస్తకపఠనం... అన్నీ చిన్ననాటి భ్రమలు. ఒకరికి ఉద్యోగం, ప్రమోషన్లు, హోదా, హై సొసైటీ.

"నాలో కవితాంశ లేదూ! కాస్త ప్రయత్నిస్తే యిప్పుడు రాస్తున్న వాళ్లందరి కన్నా అద్భుతమైన కవిత్వం కూడా రాస్తాను. కవితాభినివేశం నాలో వుందని ఆనాడే తెలిసుంటే ఏమయ్యేది? ... అప్పుడు నేను యిలాగ లక్షల్లో, కోట్లల్లో ఒక కీటకం లాగ కాక, గొప్ప కవిగా, గొప్ప చిత్రకారుడిగా, గొప్ప కళాకారుడిగ...."

చిన్నప్పుడొకసారి తల్లి చెయ్యి పట్టుకుని పోతున్నప్పుడు వీధిలో, మాసినగడ్డంతో, చిరిగిన దుస్తుల్లో వున్న ఓ వ్యక్తికి తల్లి అభివాదం చెయ్యటం చూశాడు.

"ఎవరమ్మా ఆయన?"

"ఆయన మహాకవి."

నిజమే. కవులంటే కవితాభిమానులకెంత భక్తి.

ఓ రాజకీయనాయకుడో, ఓ కోటీశ్వరు, మరో బలిసిన పెద్ద మనిషినెవర్ని చూసినా మనం భయపడతాం. గాని గౌరవం మాత్రం కలగదు. కళాకారులకంత మర్యాద వుంటుంది.

ఉద్యోగమంటేనే బంధిఖానా. ఉద్యోగులందరూ ఎంత పెద్ద వుద్యోగులయినాసరే ఖైదీలు. కళాకారుల జీవితంలో స్వేచ్ఛ వుంటుంది. స్వేచ్ఛా ప్రియత్వం, ఒకరికి అణిగి వుండకపోవటంలోనే కళా సృష్టి వుందసలు. కీర్తి, ప్రతిష్ట. షేక్‌హాండ యివ్వటానికే తహతహలాడే అభిమానులు, పూలదండలు, సన్మానాలు, సత్కారాలు, గౌరవపట్టాలు.

"నాది చాలా పెద్ద ఉద్యోగమే. కాని నా చప్రాసీకి తప్ప నాపేరే ఎవరికీ తెలియదు.... కాని వాడి కవిత్వం దేశమంతటా గానం చేస్తుంటారు. చిత్రకారుడు నిద్రమత్తులో జోగుతుండవచ్చుగాక, కాని మ్యూజియంలో, గ్యాలరీలలో వాడి చిత్రకళా ప్రాభవానికి వున్మత్తులై పోతుంటారు కళాభిమానులు.

సాహిత్య, కళా జ్ఞానం లేనివాడు వింత పశువు....

వైను మత్తులో కొత్త కలలు వస్తున్నాయి.

కళాకారుల, కవుల జీవితం ఎంత అద్భుతంగా వుంటుందో!

"ఈ క్షణాన, నేను ఈ వెధవ వుద్యోగం మానేసి కళాకారుడిగా కొత్త జీవితం ప్రారంభిస్తే..."

తను... కవి, చిత్రకారుడు, ఉద్యోగి గనక యిన్నాళ్లూ తను గురబ్బగ్గీలో యింటికి చేరుకునేవాడు. కళాకారులకు గురబ్బగ్గీనెక్కణ్ణుంచి వస్తాయి? కాళ్లీడిస్తూ వస్తాడు. గుడ్డలా? ఈ సిల్కుగుడ్డలు. ఈ ఖరీదైన ఫాషనబుల్ డ్రస్సులు కళాకారులకుండవు గదూ! మాసిన, చిరిగిన గుడ్డలు మరి. పేదరికంలో ఏముంది! దేశమంతటా తన పేరు ప్రఖ్యాతులు మార్మోగిపోతున్నాయి.... కాని భోజనం సరిగా వుండదే! ఆకలి తీరదే! పనిమనుషులకు బక్షీసులివ్వకపోతే ఎవ్వరూ తన మాట వినరు... అసలు పనిమనుషులుంటారా? కవిగా తను మహనీయుడు. కాని వ్యక్తిగా క్షుద్రా కీటకం.

ఇంట్లో ఇల్లంటూ వుంటే ఫర్నిచర్ లేదు. లైట్లు లేవు. తిండిలేదు. మందు లేదు (గ్లాసుడు నీళ్లున్నాయా అసలు?) ... మంచం లేదు. మంచం వున్నా పరువు లేదు. చలికాలం. వున్ని బట్టలు లేవు. రూం హీటరు లేదు. ఆకలిగా, దాహంగా వున్నా, చివరికి అలసటతో నిద్రపడుతుంది.

లేచి చూస్తే... జేబులు ఖాళీ. టేబుల్ డ్రాయర్లో చెక్ బుక్ లేదు.

మత్తు దిగింది. భయంతో ఒళ్లు చమట పట్టింది.

"కవిత్వమూ, చిత్రకళా తగలెయ్య. ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు ఆనాడు వచ్చివుంటే యిప్పటికీ నాగతేమయ్యేదో గదా! భగవంతుడు కరుణామయుడు. నన్ను రక్షించాడు." అనుకుని ముడుచుకు పడుకున్నాడు. ■

## నష్టానికి వెరవటం లేదు!

బాలీవుడ్‌లో 2002లో తీసిన పెద్ద బడ్జెట్ చిత్రాలన్నీ ఫ్లాపయ్యాయి. అట్లా మొత్తం వంద కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందట పరిశ్రమకు. కానీ నాలుగు కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిన 'రాజ్' చిత్రం 21 కోట్ల బిజినెస్ చేసిందట. అటు తరువాతైనా కాస్త తక్కువ బడ్జెట్‌తో చిత్రాలు తీయొచ్చు కదా! ఊహూఁ! ఫిరోజ్ నడియాడ్‌వాలా 'పులీస్ ఫోర్స్', ప్రవీణ్‌షా 'ద హీరో' చిత్రాలను 45 కోట్ల బడ్జెట్టుతో నిర్మించారు. మరి నష్టం కాకపోతే ఏమిట్టు?

ఎన్.

